సాక్షి ప్రకాశం

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



ఒంగోలును ముంచెత్తిన వాన

ఒంగోలు నగరంలో శనివారం మధ్యాహ్నం గంటకు పైగా కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఒంగోలు-కర్నూలు రహదారిపై మోకాలి లోతు నీరు నిలిచింది. -10లో..



దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

జిల్లావ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం విజయవంతమైంది. రెండు రోజుల పాటు చేపట్టిన ఈ కార్యక్రమంతో జిల్లాలో స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు గణనీయంగా పడిపోయాయి. -10లో..

గరిష్టం/కనిష్టం
33 /25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ నాయకులపై కేసు నమోదు

మార్కాపురం: మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబుతోపాటు మరికొంత మంది ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులపై రూరల్ పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదు చేశారు. శుక్రవారం మెడికల్‌కాలేజీ వద్ద నిర్వహించిన ప్రదర్శన కార్యక్రమంలో 30 పోలీసుయాక్టు ఉల్లంఘించారని, మైక్ పర్మిషన్ లేకుండా మాట్లాడారని పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లా వాసులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లాకు చెందిన నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ సెక్రటరీగా యర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన సయ్యద్ మోటార్ జబీబుల్లా, రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా ఒంగోలు నియోజకవర్గానికి చెందిన కొండూరి నవీన్ కృష్ణారెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీగా కొండపి నియోజకవర్గానికి చెందిన సింగెపోగు వలీ షరాన్, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీగా యర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన చిలకల ఇస్రాయిల్, రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన పెనుబోతు రంగారావు, రాష్ట్ర దివ్యాంగుల విభాగం జనరల్ సెక్రటరీగా కొండపి నియోజకవర్గానికి చెందిన తవ్వా బ్రహ్మయ్యలను నియమించినట్లు పార్టీ కార్యాలయం తెలిపింది.

డ్రగ్ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఏలూరి

మార్కాపురం: బల్క్ డ్రగ్ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీగా మార్కాపురం పట్టణానికి చెంది ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎస్ఆర్‌సీ లాబోరేటరీస్ ఎండీగా ఉన్న డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డిని ఎంపిక చేశారు. శనివారం హైదరాబాదులో జరిగిన 34వ జనరల్ బాడీ సమావేశంలో దేశంలోని అన్నీ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరైనట్లు రామచంద్రారెడ్డి తెలిపారు.

కడలిలో తమిళ తంబీల ఆగడాలు ఇక చెల్లవంటున్నారు జిల్లా మత్స్యకారులు. నడిసంద్రంలో సమరానికి సై అంటున్నారు. మా ప్రాంతంలోకి వచ్చి మత్స్య సంపదను దోచుకుపోవడమే కాకుండా రూ.లక్షలు విలువజేసే వలలు ధ్వంసం చేస్తుంటే చూస్తూ ఊరుకోం.. ఇటువైపు కన్నెత్తి చూస్తే ఎదురుదాడులు తప్పవని హెచ్చరికలు చేస్తున్నారు. ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల మత్స్యకారులు సమావేశమై సోనాబోట్ల అంతుచూడాలని నిర్ణయించుకున్నారు. చేపల వేటతో పాటు నిబంధనలు ధిక్కరించే తమిళ జాలర్లను కూడా వేటాడేస్తామంటూ కదనరంగంలోకి దిగారు. ఇప్పటికే రెండు సోనాబోట్లను స్వాధీనం చేసుకున్నారు.



నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె పోర్టుకు దాడిలో పట్టుకున్న కడలూరు బోటును వెంటబెట్టుకుని తీసుకుని వస్తున్న రెండు జిల్లాల మత్స్యకారులు

కన్నీళ్లే..ఆయుధాలై

కడలూరు సోనాబోట్లపై మన మత్స్యకారుల దండయాత్ర

- కడలిలో తమిళనాడు కడలూరు బోట్ల ఆగడాలు
- నిత్యం 80 బోట్లతో దాడులు
- విలువైన మత్స్య సంపద దోపిడీతో పాటు వలలు ధ్వంసం
- మారణాయుధాలతో మత్స్యకారులపై దాడులు
- స్పందించని కూటమి ప్రభుత్వం
- ఈనెల 11, 19 తేదీల్లో రెండు సార్లు వేట నిషేధం
- కడలూరు బోట్లపై దాడికి వెళ్లి తరిమికొట్టిన మత్స్యకారులు
- సోనాబోటు స్వాధీనం.. జువ్వలదిన్నె హార్బర్‌కు తరలింపు
- నెల కిందట ఒక బోటు స్వాధీనం



జువ్వలదిన్నె పోర్టులో ఆగిన కడలూరు బోటును పరిశీలిస్తున్న మత్స్యకారులు

ఒంగోలు, టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి నెల్లూరు, తిరుపతి జిల్లా తడ వరకూ సుమారు 281 కిలోమీటర్లు తీరప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో మత్స్యకారులు ప్రాణాలు పణంగా పెట్టి చిన్న బోట్లతో వేట సాగిస్తున్నారు. మత్స్య సంపదను తెచ్చుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. వీరిపై మెకనైజ్డ్ (సోనా) బోట్లతో తమిళ జాలర్లు సమూహంలా వచ్చి మారణాయుధాలతో దాడులకు తెగబడుతున్నారు. రూ.లక్షల విలువైన వలలను ధ్వంసం చేస్తున్నారు. మత్స్య సంపదను దోచుకెళ్లిపోతున్నారు. తమిళనాడుకు చెందిన కడలూరు జాలర్లతో మన మత్స్యకారుల సమరం నిత్యకృత్యంగా మారింది. చేపల కోసం వేట చేయడం ఒక ఎత్తైతే, సముద్రంలో తమిళ జాలర్ల నుంచి కాపాడుకోవడం మరో ఎత్తుగా మారింది. చిన్న ఇంజిన్ ఉన్న బోట్లతో సముద్రంలో తీరం నుంచి 8 కి.మీ. లోపలే వేట సాగించుకోవచ్చు. ఇంకా లోపలికి వెళ్లి వేట సాగించుకోవచ్చు. ఇక ఇతర రాష్ట్రాలకు చెందిన జాలర్లు ఒడ్డు నుంచి 23 కి.మీ. అవతలి జలాల్లో మాత్రమే చేపల వేట చేసుకోవాల్సి ఉంటుంది. ఒడ్డు నుంచి సముద్రంలో 8 కి.మీ. వరకు మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. తమిళనాడులో వేల సంఖ్యలో ఈ రకం బోట్లు ఉన్నాయి. వీటిలో కనీసం 5 నుంచి 10 మంది వరకు మత్స్యకారులు ఉంటారు. అధునాతన వలలు, మారణాయుధాలతో మన ప్రాంతం వైపు వచ్చి దాడులు చేస్తున్నారు. వీరి నుంచి రక్షించాలని అధికారులను, పాలకులను కోరుతూ వస్తున్నారు. అయినా ఎలాంటి ఫలితం కనిపించలేదు..

స్వీయ వేట నిషేధం..

మత్స్యకారులు ఎన్నోసార్లు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకపోవటంతో చివరకు మత్స్యకారులు తమ సమస్యను తామే పరిష్కరించుకోవటానికి నడుం బిగించారు. చిన్నబోటుతో చేపల వేటకు వెళితే సముద్రంలో 60 నుంచి 80 వరకు సోనాబోట్లు చేపల వేట సాగిస్తూ మత్స్య సంపద కొల్లగొట్టడంతో పాటు లక్షలాది రూపాయల వలలు ధ్వంసం చేసేవని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సోనాబోట్ల కట్టడికి మన జిల్లాతో పాటు, పక్కనే ఉన్న నెల్లూరు జిల్లాకు చెందిన మత్స్యకార కాపులు ఈ నెల 11వ తేదీన సమావేశమయ్యారు. మూడు రోజుల పాటు వేట నిషేధం అని ప్రకటించారు. 12వ తేదీ రాత్రి గతంలో తాము వేటాడి నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నె హార్బర్‌లో ఉంచిన కడలూరుకు చెందిన సోనాబోటును తీసుకుని సుమారు 80 మంది జాలర్లు కర్రలు, కేట్ బాల్స్, టపాసులు తీసుకుని తీరంలో సోనాబోట్ల వేట ప్రారంభించారు. ఆంధ్రా మత్స్యకారులు తమపై దాడికి వస్తున్నారని సమాచారం రావటంతో జాగ్రత్త పడ్డ కడలూరు జాలర్లు పారిపోయారు. నిషేధకాలం పూర్తయిన తరువాత నాలుగు రోజుల పాటు మత్స్యకారులు చేపల వేట కొనసాగించగా ఈనెల 18వ తేదీ గురువారం రాత్రి సోనాబోట్లు తీరానికి దగ్గరగా వచ్చి లక్షలాది రూపాయలు వలలు తెంచుకుని చేపల వేట సాగించారు. ఈసారి కడలూరు బోట్లను వదిలేది లేదని నిశ్చయించుకున్నారు. తిరిగి 19వ తేదీ చేపల వేట నిషేధం అని మత్స్యకార గ్రామాల్లో రెండవసారి దండోరా వేయించారు.

ఏడాదిన్నరగా నిరీక్షణ..

కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో మత్స్యకారుల సమస్యను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి దృష్టికి తీసుకుని వెళ్లారని, సీఎం చంద్రబాబు కూడా స్పందించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్న విషయం అప్పట్లో సోషల్ మీడియాలో కూడా వైరల్ అయింది. అయినా సంవత్సరం దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల విజ్ఞప్తితో అద్దెకు స్పీడ్‌బోటు తీసుకుని కొద్దిరోజుల పాటు సోనాబోట్లను అడ్డుకునే ప్రయత్నం చేసింది. కానీ కూటమి ప్రభుత్వంలో మాత్రం మత్స్యకారుల బాధలు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో విసుగు చెందిన మత్స్యకారులు సమస్యను వారే పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నారు.

సోనాబోట్లపై ఎదురుదాడి..

గురువారం రాత్రి తమిళ జాలర్లు దాడులు చేయడమే కాకుండా మన ప్రాంత మత్స్యకారులను అవమానించే రీతిలో వ్యవహరించారు. దీంతో వారికి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం రాత్రి నెల్లూరు జిల్లా కొడవలూరు సమీపంలోని కొనపూడి సముద్రతీరంలో సోనాబోట్లతో చేపల వేట సాగిస్తున్న సమాచారం అందింది. వెంటనే రెండు జిల్లాల మత్స్యకారులు అక్కడకు బయలు దేరారు. వారిని అడ్డుకున్నారు. బోటును స్వాధీనం చేసుకుని విజయం సాధించారు. ఆ బోట్లలో మారణాయుధాలతో పాటు, 15 మంది వరకూ తమిళ మత్స్యకారులు ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా గత నెలలో సైతం తమిళజాలర్లను తరిమికొట్టి ఒక సోనాబోటును స్వాధీనం చేసుకుని జువ్వలదిన్నె హార్బర్‌లో ఉంచారు. సుమారు నెల రోజులు దాటినా ఇంత వరకు తమిళనాడు మత్స్యకారులు ఎవరూ ఈ బోటు కోసం వచ్చిన దాఖలాలు లేవని తెలిసింది. తాజాగా మరో బోటును కూడా స్వాధీనం చేసుకుని దాన్ని కూడా జువ్వలదిన్నెకు తరలించినట్టు సమాచారం. ఇకపై ఎవరు సహకరించినా, సహకరించకపోయినా వెనక్కి తగ్గేదే లేదని ఇకపై తమిళనాడు సోనాబోట్లకు చుక్కలు చూపిస్తామని మత్స్యకారులు హెచ్చరిస్తున్నారు.

పేదలకు భూములు పంచాలి

- పేదలకు భూ పంపిణీ కోరుతూ 24న విజయవాడలో మహాధర్నా
- జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ఒంగోలు సిటీ: పరిశ్రమల పేరుతో, కారిడార్లు, పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రాల పేరుతో ప్రభుత్వం భూమి సేకరించిన ప్రాంతాల్లో గత దశాబ్ద కాలంగా జిల్లాలో పరిశ్రమలు ఏవీ ఏర్పాటు చేయలేదని, అటువంటి ప్రాంతాల్లో పరిశ్రమలైనా ఏర్పాటు చేయాలి, లేదా ఆ భూములను సాగుకు యోగ్యంగా మార్చి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎల్బీజీ భవన్‌లో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో అటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్ర విభజన సందర్భంలో దొనకొండ రాజధానిగా ఏర్పడుతుందని, తద్వారా వెనకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశించారన్నారు. దొనకొండ ప్రాంతంలో 24 వేల ఎకరాలు సేకరించి పరిశ్రమలు పెడతామని 2016లో ప్రభుత్వం ప్రకటించిందని, అనేక దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు వచ్చి ఆ ప్రాంతాన్ని చూసిపోవడం తప్ప ఇంత వరకు ఒక్క పరిశ్రమ ఏర్పడలేదని అన్నారు. 2,396 ఎకరాల భూమిని ప్రభుత్వం ఏపీఐఐసీకి కేటాయించి డెవలప్ చేసి పరిశ్రమలకు అప్పజెప్పాలని ప్లాట్లు రూపొందించిందని తెలిపారు. అయినా ఇంతకు ఎటువంటి పరిశ్రమ లేదని అన్నారు. అలాగే పామూరు, పీసీపల్లి మండలాల పరిధిలో నిమ్జ్ పేరుతో 14 వేల ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రస్తుతం 1800 ఎకరాలు సేకరించి ఏపీఐఐసీకి కేటాయించారని తెలిపారు. అక్కడ కూడా ఎటువంటి పరిశ్రమ ఇంత వరకు నిర్మాణం జరగలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు దివాకరపల్లి, కలుజువ్వలపాడు, కురిచేడు తదితర ప్రాంతాల్లో భూ సేకరణకు సిద్ధమవుతోందని ఆయన తెలిపారు. సేకరించిన భూమిలో పరిశ్రమలైనా పెట్టాలి, లేదా సాగుకి యోగ్యంగా మార్చి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని ఈనెల 24వ తేదీన విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రజలు ఆ ధర్నాకు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశానికి ముందుగా ఇటీవల కాలంలో మరణించిన అమరవీరులకు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సమావేశంలో జిల్లా నాయకులు కేజీ మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, గుమ్మా బాలనాగయ్య, ఉబ్బ వెంకటేశ్వర్లు, వేసపోగు మోజెస్, కొమ్మాలపాటి మాల్యాద్రి, మల్లెల సంపూర్ణ, కంకణాల వెంకటేశ్వర్లు, జాలా అంజయ్య, తన్నీరు సుజాత, పిల్లి కష్ణ, అన్నవరపు శేషారావు, పి శ్రీను, ఈదర సుబ్బారావు, కే వెంకటమ్మ, వై వీరనారాయణ పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన

- ప్రభుత్వ ఆర్థిక విధానాలతో అంగన్‌వాడీల నిర్లక్ష్యం
- రాష్ట్ర మహా సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి సింధు పిలుపు



ఉద్యమ నేతల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు సిటీ: ఐక్య ఉద్యమాల ద్వారానే అంగన్‌వాడీల హక్కులను సాధించుకోవాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ.ఆర్.సింధు పిలుపునిచ్చారు. ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో శనివారం ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ 11వ రాష్ట్ర మహాసభల ప్రారంభ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు జి బేబీ రాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సింధు మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడేళ్లలో అంగన్‌వాడీలు చేపట్టిన ఉద్యమం ఎన్నో ఫలితాలు సాధించి భవిష్యత్తు ఉద్యమానికి బాటలు వేసిందన్నారు. పౌష్టికాహారం అందించే విషయంలో విధించిన ఎఫ్ఆర్ఎస్ వంటి నిబంధనలు సిబ్బందితో పాటు లబ్ధిదారులకు ఇక్కట్లు పెంచేదిగా ఉన్నాయన్నారు. లబ్ధిదారులు ఆధార్, బ్యాంకు అకౌంట్‌తో లింక్ చేసినపుడు ప్రభుత్వం ప్రత్యేకించి ఎఫ్ఆర్ఎస్ నిబంధనలు, ఓటీపీ నిబంధనలు తీవ్ర ఆటంకంగా మారినట్లు మండిపడ్డారు. సెంటర్లలో తగిన హాజరు లేదని షోకాజ్ నోటీసులు ఇవ్వడం వంటి వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ అమలుతో ప్రీ ప్రైమరీ పాఠశాలలు విలీన ప్రక్రియతో అంగన్‌వాడీ కేంద్రాలకు బాలలు దూరం అవడం, ప్రైవేట్ పాఠశాలల బాట పట్టడం వంటి పరిణామాలు పరిగణలోకి తీసుకోకుండా అంగన్‌వాడీలను టార్గెట్ చేస్తున్న ప్రభుత్వ నిరంకుశ చర్యలను ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేవలం ఎనిమిది రూపాయలకు ఎటువంటి పౌష్టికాహారం అందించగలమో చెప్పాలని నిలదీశారు. మోదీ జన్మదిన ప్రచారం పేరుతో ఒక్క రూపాయి బడ్జెట్ కేటాయించకుండా 15 రోజులు పాటు పోషణ్ మాసోత్సవం నిర్వహించాలని ఆదేశించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి అంగన్‌వాడీలు క్షేత్ర స్థాయిలో కార్మిక, కర్షక, ఉద్యోగ, ఐక్య సంఘటన నిర్మించాలని, దానికి అంగన్‌వాడీలు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఉద్యమానికైనా స్ఫూర్తినిచ్చేది అంగన్‌వాడీ ఉద్యమమేనన్నారు. ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేట్ రంగానికి అప్పగించే ప్రయత్నం చేయడం ఆక్షేపణీయమన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘ అధ్యక్షురాలు డాక్టర్ ఎం ఉదయని తదితరులు మాట్లాడారు. తొలుత మహాసభల ప్రారంభ సూచనగా సంఘ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు జీ బేబీ రాణి ఎగురవేశారు. మహాసభలో ఇటీవల మృతిచెందిన ఉద్యమ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వీ ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు కే ఉమామహేశ్వరరావు, కే ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్, కార్యదర్శి గంటినపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై సత్యవతి, ఈదర అన్నపూర్ణ, కేవీ సుబ్బమ్మ, సీఐటీయూ అనుబంధ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉద్యమిద్దాం..

- ప్రభుత్వ మెడలు వంచి డిమాండ్లను సాధించుకుందాం
- రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ పిలుపు



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

ఒంగోలు సబర్బన్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అందరం కలిసి ఐకమత్యంగా ఉద్యమిద్దాం..ప్రభుత్వ మెడలు వంచి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా ముందుకు పోదామని విద్యుత్ ఉద్యోగుల ఐక్య పోరాట సాధన సమితి నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక విద్యుత్ భవన్ ముందు శనివారం విద్యుత్ ఉద్యోగుల ఐక్య పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. జోరు వానలో కూడా నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా జేఏసీలోని 1104 నాయకుడు రాచగర్ల సంజీవ్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. కార్మిక సంఘాలు గతంలో ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయుటం దారుణమని మండిపడ్డారు. ముఖ్యంగా డిస్ట్రిబ్యూషన్ కంపెనీల యాజమాన్యం కార్మిక చట్టాలకు, విద్యుత్ బోర్డ్ విభజనకు ముందు ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న త్రైపాక్షిక ఒప్పందానికి విరుద్ధంగా సర్వీస్ నిబంధనలను ఏకపక్షంగా మార్పులు చేస్తున్నారన్నారు. త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం బోర్డు విభజనకు ముందు అమలులో ఉన్న సర్వీస్ నిబంధనలు, పని ప్రమాణాలు, కారుణ్య నియామకాలు తదితర ప్రయోజనాలు యధావిధిగా కొనసాగుతాయని, ఏవైనా మార్పులు చేయాలంటే ఉద్యోగ సంఘాలతో చర్చించి ప్రస్తుత ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా పరస్పర అవగాహనతో ఒప్పందాలు చేయాలే తప్ప ప్రభుత్వం మారినప్పుడల్లా ఇష్టారీతిన మార్చుకుంటూ పోవటం దారుణమన్నారు. పూర్వం నుంచి అమలులో ఉన్న 'వెయిటేజ్' ఫార్ములాను రద్దుచేసి, అతి తక్కువ శాతం (8%) ఫిట్మెంట్ బెనిఫిట్‌ను.. పాత పద్ధతికి విరుద్ధంగా ఇంక్రిమెంట్లు, మాస్టర్ స్కేలు రూపొందించారన్నారు. ఈ పద్ధతి వల్ల ఉద్యోగులు చాలా నష్టపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై యాజమాన్యాలతో పలుధపాలుగా చర్చించినా ఫలితం లేదన్నారు. జేఏసీలో భాగస్వాములైన సంఘాలన్నీ ఆగస్టు 24వ తేదీన సమావేశమై ముఖ్య సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు దశలవారీ ఆందోళనా కార్యక్రమం రూపొందించినట్లు చెప్పారు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు అందరూ పవర్ జేఏసీ ఇచ్చిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఎస్.కృష్ణయ్య, కన్వీనర్ ఎం.వి.రాఘవరెడ్డితో పాటు ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ సంస్థకు సీనరేజ్ వసూలు బాధ్యతలపై చర్చ

- చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమల ఓనర్స్ అండ్ అసోసియేషన్



సమావేశంలో మాట్లాడుతున్న గ్రానైట్ ఓనర్స్ అండ్ అసోసియేషన్ అధ్యక్షులు

చీమకుర్తి రూరల్: ప్రైవేట్ సంస్థలకు సీనరేజ్ వసూలు బాధ్యతలు అప్పగించడంపై మండల పరిధి రామతీర్థం సెంటర్‌లోని వీటీసీ కార్యాలయంలో గ్రానైట్ పరిశ్రమల ఓనర్స్ అండ్ అసోసియేషన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ పరిశ్రమల ఓనర్స్ అండ్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ 1వ తేదీ నుంచి ప్రైవేట్ సంస్థ వారు సీనరేజ్ వసూలు చేస్తారన్నారు. కానీ ముందుగా గ్రానైట్ పరిశ్రమల యజమానులతో సీనరేజ్ వసూలు దక్కించుకున్న సంస్థ విధి విధానాలు చర్చించాలని, వారి విధి విధానాలు అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటే బాగుంటుందన్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులకు సీనరేజ్ వసూలులో ఆమోదయోగ్యం లేకపోతే అక్టోబర్ 1వ తేదీ నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలు మూసివేసి ధర్నా చేసి సమ్మెలోకి వెళ్లామన్నారు. కార్యక్రమంలో చీమకుర్తి, కమ్మంపాడు, బూదవాడ, ఏలూరురోడ్డు గ్రానైట్ ఓనర్స్ అండ్ అసోసియేషన్ అధ్యక్షులు కాట్రగడ్డ రమణయ్య, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, యర్రగుంట్ల శ్రీనివాసరావు, ఎం వెంకటేశ్వర్లు, లగడపాటి శ్రీను, ప్రసాదరెడ్డి, సుబ్బారావు, ఉలిసిరెడ్డి, ఆళ్ల రవి, గ్రానైట్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు రోడ్డుపై వరద నీటిలో ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు, పాదచారులు

ఒంగోలును ముంచెత్తిన వాన..!



ఒంగోలులోని కర్నూలు రోడ్డుపై ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్లో భారీగా నిలిచిన వర్షం నీరు

ఒంగోలు నగరంలో శనివారం మధ్యాహ్నం గంటకుపైగా కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఒంగోలు - కర్నూలు రోడ్డుపై మోకాలి లోతున నీరు నిలిచింది. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, అద్దంకి బస్టాండ్, నెల్లూరు బస్టాండ్, పాత మార్కెట్ సెంటర్, భాగ్యనగర్, గాంధీరోడ్డు, తదితర ప్రధాన రహదారులపై సైతం భారీగా నీరు నిలిచింది. వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ద్విచక్ర వాహనాలు సగానికిపైగా నీటిలో మునిగి మరమ్మతులకు గురై ఆగిపోవడంతో నీటిలోనే నెట్టుకుంటూ వెళ్లారు. నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ఓ మోస్తరు వర్షానికే పలు ప్రాంతాలు జలమయమై ప్రజలు అవస్థ పడుతున్నారు.

\- సాక్షి, ఒంగోలు



గాంధీరోడ్డులో భారీగా వరద నీరు



పాత మార్కెట్ సెంటర్‌లో ఇదీ పరిస్థితి...



నెల్లూరు బస్టాండ్ పెట్రోలు బంకు ఎదుట...



భాగ్యనగర్ 4వ లైన్ ఎదురుగా రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



నీటిలో అతి కష్టంమీద వెళ్తున్న స్కూల్ విద్యార్థుల ఆటో

విద్యుదాఘాతానికి రైతు బలి



గురవయ్య మృతదేహం

బేస్తవారిపేట: విద్యుదాఘాతానికి రైతు బలయ్యాడు. ఈ సంఘటన మండలంలోని ఖాజీపురంలో శనివారం జరిగింది. వివరాలు.. ఎస్సీ కాలనీకి చెందిన వినుకొండ గురవయ్య (45) తాను సాగు చేసుకుంటున్న మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు ఉదయాన్నే వెళ్లాడు. మోటార్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడాన్ని గుర్తించాడు. పొలం పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఫ్యూజ్ వేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం సమయంలో గురువయ్య తమ్ముడు ఆంథోని ఎప్పటిలాగే పొలానికి వెళ్లి చెట్టు వద్ద భోజనం బాక్స్ పెట్టి తిరిగి ఇంటికి వెళ్లాడు. సాయంత్రమైనా అన్న గురవయ్య ఇంటికి రాకపోవడంతో మళ్లీ పొలం వద్దకు వెళ్లాడు. భోజనం అక్కడే ఉండటంతో పొలం అంతా వెతికాడు. పరిసరాల్లో వెతుకుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గురవయ్య మృతి చెంది ఉండటాన్ని గుర్తించాడు. మృతుడి భార్య ఓబులమ్మ మూడేళ్ల క్రితం మృతి చెందింది. వీరికి ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. నలుగురూ చదువుకుంటున్నారు. తల్లిదండ్రుల మరణంతో పిల్లలు దిక్కులేనివారయ్యారు. కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి



సీఎస్ పురం (పామూరు): గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతిచెందిన సంఘటన శనివారం ఉదయం సీఎస్ పురం మండలంలోని కోవిలంపాడు వద్ద 167బీ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. మృతిచెందిన గేదెల విలువ సుమారు రూ.1.10 లక్షల దాకా ఉంటుంది. ఇటీవల 15 రోజుల వ్యవధిలో 3 కిలోమీటర్ల పరిధిలో 18 గేదెలు మృత్యువాతపడ్డాయి. పశుపోషకులకు పోలీసులు అవగాహన కల్పించి పశువులకు రేడియం స్టిక్కర్లు అంటించేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే వాహనదారులు గేదెలను ఢీకొని ప్రమాదాలకు గురవడం, గేదెలు కూడా మరణించడం వంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రజలు కోరుతున్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు 37-1-407/12, 2వ లైను, భాగ్యనగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001.

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

[illegible]

స్థిరాస్తి వివరములు

[illegible]

తేది : 16.09.2025. ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

పలు రైళ్లలో పోలీసుల విస్తృత తనిఖీలు

● సుమారు 1.5 కిలోల గంజాయి స్వాధీనం

ఒంగోలు సిటీ: గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఒంగోలు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ, ఈగిల్ టీం, ఇతర పోలీసు సిబ్బంది శనివారం పలు రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. మాదకద్రవ్యాలను గుర్తించే ప్రత్యేక శిక్షణ పొందిన స్నిపర్ డాగ్ రాక్సీతో కలిసి ఒంగోలు రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్శిల్ కేంద్రాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన పార్శిళ్లు, ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులు, ఇతర వస్తువులను ఒక్కొక్కటిగా తనిఖీ చేశారు. హౌరా నుంచి బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీ చేయగా, పశ్చిమబెంగాల్‌కు చెందిన అబ్దుల్ హుదుద్ అనే వ్యక్తి వద్ద సుమారు 1.5 కిలోల గంజాయి (40 గ్రాముల చిన్న ప్యాకెట్లు 38) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దర్యాప్తు నిమిత్తం అతన్ని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను రవాణా చేసినా, విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాలపై ఎవరి వద్దయినా సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266కు తెలియజేయవచ్చని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుధాకర్, ఎస్సైలు శ్రీకాంత్, శివరామయ్య, ఈగిల్ టీం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రైలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

జైలును శిక్షణాలయంగా భావించాలి

● జిల్లా జడ్జి భారతీదేవి

దర్శి: ఖైదీలు జైలును శిక్షణాలయంగా భావించాలని జిల్లా జడ్జి ఏ.భారతీదేవి సూచించారు. స్థానిక సబ్‌జైల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శివశంకర్‌రెడ్డితో కలిసి శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులో సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. జిల్లా జడ్జి భారతీదేవి మాట్లాడుతూ జైలుకు వచ్చిన ఖైదీలు తమ తప్పులను మననం చేసుకుని మళ్లీ తప్పులు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దయాగుణం కలిగి ఉండాలని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, సీనియర్ సివిల్ జడ్జి శివశంకర్‌రెడ్డిలు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత మంచి జీవితానికి బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి కోటేశ్వరరావు, న్యాయవాదులు ఆదినారాయణ, సురేష్, మనోహరమ్మ పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి భారతీదేవి

గోవా మద్యం సీసాలు స్వాధీనం

మార్కాపురం: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద శనివారం వేకువజామున 7 గోవా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్సుమెంట్ సీఐలు నరహరి, రామారావు తెలిపారు. దసరా సందర్భంగా పక్క రాష్ట్రాల నుంచి రైళ్లలో మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు దాడులు చేపట్టామని, ఇందులో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా రైల్వేస్టేషన్ బయట గుర్తుతెలియని వ్యక్తి వదిలివెళ్లిన మూటను ఆటో స్టాండ్ వద్ద గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గోవా రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లుగా గుర్తించామన్నారు. దాడుల్లో కంభం సీఐ కొండారెడ్డి, మార్కాపురం ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నట్లు సీఐలు వివరించారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

సింగరాయకొండ: రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం పాకల రైల్వే గేటు సమీపంలో ఒంగోలు వైపు వెళ్లే రైల్వే ట్రాక్‌పై వెలుగు చూసింది. రైలు పట్టాలపై తల పెట్టడంతో అతడి తల ఛిద్రమైంది. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఒంటిపై పెద్ద పసుపు గళ్లు, బ్లూగళ్ల చొక్కా, లైట్ సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించినట్లు ఒంగోలు జీఆర్పీ పోలీసులు వివరించారు.

దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దస్తావేజు లేఖర్లు

- కార్డు 2.0 విధానం లోపభూయిష్టం
- ప్రజలు, దస్తావేజు లేఖర్లకు తీవ్ర ఇబ్బందులు
- జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్ల ధర్నా

ఒంగోలు సబర్బన్: జిల్లా వ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం విజయవంతమైంది. రెండు రోజుల పాటు చేపట్టిన ఈ కార్యక్రమంతో జిల్లా వ్యాప్తంగా స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు గణనీయంగా పడిపోయాయి. రెండో రోజు శనివారం ఒంగోలులోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోపర్తి హరిబాబు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ప్రవేశ పట్టిన కార్డ్ 2.0 విధానంలో స్థిరాస్తుల నమోదుకు పబ్లిక్ డేటా ఎంట్రీ ఉన్న విషయం విదితమేనన్నారు. సదరు పబ్లిక్ డేటా ఎంట్రీలో కక్షిదారుల వివరాల నమోదు చేసేందుకు ఇటీవల ప్రభుత్వం ఆధార్ ఆధారిత ఓటీపీ ప్రవేశ పెట్టిందన్నారు. అదేవిధంగా పలు సాంకేతిక మార్పులు కూడా చేశారని వివరించారు. సదరు మార్పుల్లో ప్రజలకు, దస్తావేజు లేఖర్లకు సమస్యలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. సదరు సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం పిలుపు మేరకు రెండు రోజుల పాటు పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టామన్నారు. పబ్లిక్ డేటా ఎంట్రీలో ఎదురవుతున్న సమస్యలు కోకొల్లలన్నారు. కక్షిదారుల పేర్లు నమోదులో భాగంగా పలు దశల్లో ఓటీపీలు నమోదు చేయటం, కక్షిదారులు, ఆస్తి వివరాల నమోదు చేసే చెక్ స్లిప్ రిజిస్ట్రేషన్ శాఖ ఆన్‌లైన్‌లో సబ్ మిట్ చేసిన తరువాత ఎడిట్ ఆప్షన్ సౌకర్యం లేకపోవడం అత్యంత దారుణమన్నారు. ఎన్ఆర్ఐలు కక్షిదారులుగా ఉన్నవారికి ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ నమోదు కాకుంటే వారికి రిజిస్టర్ చేసుకొనే అవకాశం లేకపోవటం సరైంది కాదన్నారు. కక్షిదారులు ఏవైనా కారణాలతో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రాలేని స్థితిలో ఉంటే పూర్వం వారి ఇంటి వద్దకే సబ్ రిజిస్ట్రార్ వెళ్లి రిజిష్టర్ చేసే అవకాశం వుండేదని, ప్రస్తుతం ఆ విధానం లేకుండా పోయిందని హరిబాబు విచారం వ్యక్తం చేశారు.

పోలీసుల వినూత్న కార్యక్రమం

● బహిరంగంగా మద్యం సేవించే వారితో అక్కడే పరిశుభ్రం చేయించిన వైనం

ఒంగోలు సిటీ:

జిల్లావ్యాప్తంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ వి.హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో బహిరంగంగా మద్యం సేవించే వారిని గుర్తించి ఆ ప్రదేశాన్ని వారితోనే శుభ్రం చేయించారు. ఆరుబయట మద్యం సేవించి ప్రజలను ఇబ్బంది పెట్టే వారిలో సత్ప్రవర్తన తీసుకురావడానికే జిల్లా వ్యాప్తంగా ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎస్పీ తెలిపారు. దాంతో పాటు ఆయా ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. మందుబాబులు జాగ్రత్తగా ఉండాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా, మద్యం తాగి రోడ్డెక్కినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎవరైతే ఆరుబయట మద్యం సేవిస్తున్నారో.. వారిని గుర్తించి ఆ మత్తు దిగేంత వరకు అక్కడ వారు పడేసిన బాటిళ్లు, గ్లాసులు, ఇతర వ్యర్థాలతో పాటు పరిసరాలను శుభ్రం చేయించి ఆ చెత్తకు వారితోనే నిప్పుపెట్టించినట్లు తెలిపారు. అనంతరం పోలీసు సిబ్బంది మందుబాబులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. డ్రోన్ కెమెరాలతో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టినట్లు చెప్పారు.



పామూరులో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో మద్యం సేవిస్తున్న వారితో శుభ్రం చేయిస్తున్న ఎస్సై కిషోర్.